

పక్కింటి కోదండం ఇల్లంతా సందడిగా ఉంది. ఏమిటా అని వెళ్లి చూద్దును కదా, వాడి అయిదేళ్ల మనవడికి అందరూ హారతులు పట్టి, భజనలు చేస్తున్నారు. వాడు పెట్టుడు మీసాలతో ఠీవిగా కూర్చున్నాడు.

"ఏవిట్రా ఇదంతా? మీ మనవడి పుట్టిన రోజు పండుగా?" అడిగాను అమాయకంగా.

"ఓరి అమాయకుడా! ఇవాళ మానాన్న గారు చిరంజీవిరావుగారి పుట్టినరోజు!" అన్నాడు ఉత్సాహంగా.

"మరి మీ మనవడికి హారతులిస్తున్నారేంటి?"

"వాడు మా మనవడు కాదు. సాక్షాత్తూ మా నాన్నే మళ్లీ పుట్టాడు. వాడికి అందుకనే నాన్నగారి పేరే పెట్టాం".

"మరి ఇంతకుముందు ఇలాంటి వేడుకలు చేయలేదు కదా?"

"అలా అడిగావు బావుంది! మా చిరంజీవికి మా నాన్నగారి స్వాతంత్ర్య సమరయోధుని పింఛను మంజూరయింది..." అన్నాడు ఆనందంతో పొంగిపోతూ కోదండం.

నేను అవాక్కయ్యాను. మెల్లగా తేరుకుని, "అయిదేళ్లవాడికి స్వాతంత్ర్యసమరయోధుని పింఛనా?" అనడిగాను.

"అవునోయ్! మన మిత్రుడు చక్రపాణి గారనే పైరవీ మాస్టారు ఈ సహాయం చేసిపెట్టాడు. చక్రం తిప్పడంలో ఆయన దిట్ట".

"ఇదెలా సంభవం? ఇచ్చే వాళ్లు వాస్తవాలు పరిశీలించరా?" అన్నాను ఇంకా నమ్మకం కుదరక.

"ధనమేరా అన్నిటికీ మూలం. ఆ ధనము విలువ తెలుసుకొనుట మానవధర్మం! - ఆ పాటలో అర్థం గ్రహించుకో... అన్నీ నీకే తెలుస్తాయి. అన్నట్టు మీ మనవడు బాబీగాడిక్కూడా పెన్షన్ ప్రయత్నించమంటావా? జస్ట్ యాభై వేలు పెట్టుబడి పెడితేచాలు. జీవితాంతం పెన్షన్!"

"వద్దురా బాబూ! నేనలాంటి పనులు చేయలేను..."

"అందుకే గొర్రెతోకలా ఉండిపోయావ్... అద్సరేగానీ... రేపు తిరుపతి వెళ్తున్నాము. వస్తావా?"

"ఏమిటింత అర్జంట్ ప్రోగ్రామ్ పెట్టావ్?"

"ఇప్పుడు మావాడు, నేనూ ఉచితంగా ఫస్ట్ క్లాస్‌లో ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చు..."

"అదెలా?"

"స్వాతంత్ర్య సమరయోధులకి ఫస్ట్‌క్లాస్ ప్రయాణం ఉచితం. వాళ్లతో బాటు ఒక సహాయకుని వెంటబెట్టుకెళ్లవచ్చు. మా వాడికి పింఛన్ మంజూరయిన శుభసందర్భంలో తిరుపతిలో నీలాలు ఇచ్చిరావడానికి వెళ్తున్నాం".

"ఎవరెవరు?"

"ఇంకెవరు? నేను... సారీ సారీ... మా మనవడు, నేనూ..."

"సంతోషం! నేను కూడా వస్తాలే పద. నేను రిటైరైన రైల్వే ఉద్యోగిని కదా! నాకెలాగూ ఫస్ట్‌క్లాస్ పాసుంది" అన్నాను.

* * *

రైలు వేగంగా వెళ్తోంది.

ఫస్ట్‌క్లాస్ బెర్తుల మీద దర్జాగా పడుకుని గుర్రుపెడుతున్నారు కోదండం, చిరంజీవి!

నాకు నిద్దరపట్టటంలా.

**కేఆర్టీ**

అటూ యిటూ మసలుతుండగానే టికెట్ ఎగ్జామినర్ వచ్చాడు.

నా పాస్ చూపించాను. చూసి వెనక్కిచ్చేసాడు.

కోదండాన్ని తట్టిలేపి, టికెట్ అడిగాడు.

పర్సులోంచి పాస్ తీసి చూపించాడు కోదండం.

వివరాలు చూసి "స్వాతంత్ర్య సమరయోధుడు చిరంజీవిరావు ఎవరు?" అనడిగాడు.

అలికిడికి కళ్లు తెరిచిన కోదండం మనవడు ఠీవిగా సీటు మీద కూర్చుని "నేనే..." అన్నాడు హస్తం పైకెత్తి.

టి.టి.ఇ. షాక్ తిని, 'కలయో, నిజమో' భంగిమ పెట్టి ఓ మాటు పెన్సిలుతో బుర్రగోక్కున్నాడు. ముక్కుమీద జారుతున్న కళ్లజోడు సరిజేసుకుంటూ "నువ్వు స్వాతంత్ర్య సమరయోధుడివా?! నీ వయసెంత?" అనడిగాడు విచిత్రంగా చూస్తూ.

మళ్లీ హస్తం చూపెట్టాడు.

"నోటితో చెప్పు..."

"చెబుతున్నా కదా? అయిదేళ్ళు..."

"అయిదేళ్లవాడివి... నువ్వు స్వాతంత్ర్య సమరయోధుడివి ఎలా అవుతావ్?" సందేహంగా అడిగాడు టి.టి.ఇ.

"మూగమనసులు సినిమా చూసావా?"

"చూశాను"

"ఆ కథ జ్ఞాపకం చేసుకో... ఈనాటి ఈ బంధమానాటిదే... నేనే చిరంజీవిరావుగా స్వాతంత్ర్య సమరం చేసిన యోధుడ్ని. మళ్లీ మా ఇంట్లో పుట్టాను"

"కావొచ్చు, కానీ మా రైల్వే రూల్స్ ఒప్పుకోవు... నువ్వు టికెట్ డబ్బులు, ఫైన్ కట్టాల్సిందే" అన్నాడు జేబులోంచి రశీదు బుక్కు బయటికి తీస్తూ టి.టి.ఇ.

చిరంజీవి తాతకేసి చూసాడు. అంతవరకూ ప్రేక్షకపాత్ర వహించిన కోదండం కోపంగా ఇంగ్లీష్‌లో మాట్లాడాడు.

దానర్థం –

ప్రభుత్వం వారిచ్చిన అధికార పత్రాన్ని కాదంటానికి నువ్వెవరు? ఇది భారతస్వాతంత్ర్య సమరయోధులందరికీ అవమానం. దేశ స్వాతంత్ర్యానికి, వాళ్లు చేసిన త్యాగాలకూ అవమానం. వగైరా వగైరా...

టి.టి.ఇ. కూడా ఇంగ్లీష్‌లోనే జవాబిచ్చాడు.

దానర్థం –

నాకవన్నీ తెలియవు. మీరు డబ్బులు కట్టాలి. లేకపోతే వచ్చే స్టేషన్లో దింపేస్తా... వగైరా వగైరా...

కొంతసేపు వాగ్వివాదం తర్వాత ఎట్టకేలకు తప్పనిసరై టి.టి.ఇ. చెప్పిన మొత్తాన్ని చెల్లించి, నెత్తిన చేతులు పెట్టుక్కూర్చున్నాడు కోదండం.

టి.టి.ఇ. తన డ్యూటీ కొనసాగిస్తూ వెళ్లిపోయాడు.

* * *

చింతపండు గుజ్జుతో తామ్రపత్రాన్ని తోమి తోమి తళతళలాడేట్టు చేసింది కోదండం భార్య కామాక్షి.

బుజ్జీ... సుత్తితో ఆడకు... వేళ్లు నలుగుతాయి – హెచ్చరించింది తల్లి.

నా వేళ్లెందుకు నలుగుతాయి? మేకు పట్టుకొన్నది కిట్టూకదా? రక్కున సమాధానం చెప్పాడు బుజ్జి.

చక్రపాణి దానిని అటూఇటూ తిప్పి చూసాడు. అది దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు చిరంజీవిరావుగారిది...

"అంతా బాగానే ఉందిగానీ, నిన్ను రైల్లో ప్రయాణం చేయమని ఎవరు చెప్పారు? హాయిగా నెలకి ఆరువేలు పెన్షన్ తీసుకుని కులాసాగా కాలక్షేపం చేయకుండా లేనిపోని సమస్యలు తలకెత్తుకుంటావెందుకు?" కోదండాన్ని మందలించాడు.

"అంతా నా ఖర్మ! ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణం చేయొచ్చు కదా అని ఉబలాటపడ్డాను. ఇలా అవుతుందనుకోలేదు..." గుండు తడుముకున్నాడు కోదండం. ఇంకా పచ్చిగా ఉన్న కత్తిగాటు మంట పెట్టింది.

చిరంజీవి దిగాలుగా బుగ్గన చేతులాన్చుకుని కూర్చున్నాడు. లైటు వెలుగులో గుండు నిగనిగలాడుతోంది.

పరిస్థితి చూస్తుంటే నవ్వాపుకోవడానికి నేను చాలా ఇబ్బందిపడాల్సి వస్తోంది.

"కిం కర్తవ్యం?" అన్నాడు కోదండం ఆవేదనగా.

"ఒక్కటే దారి. ఇక నుంచి నువ్వే చిరంజీవిరావు అవతారమెత్తాలి. అప్పుడు ఏ సమస్యా ఉండదు..."

"ఇంతకీ పెన్షనుదార్లకి వయస్సెంత ఉండాలి"

"1947 సంవత్సరానికి ఏడేళ్లు ఉండాలి"

"అంటే ఇప్పటికి 66 సంవత్సరాలు అంతేనా?"

"నీ వయస్సెంత?"

"67 సంవత్సరాలు".

"ఇంకేం? ఇక ఇబ్బందే లేదు..."

బార్‌లో కూర్చొని ఉన్న ఒక తాగుబోతు గారి ఉవాచ...

'గెలీలియో గొప్ప తాగుబోతై ఉండాలి. లేకపోతే భూమి తిరుగుతోందని ఆయన గారికెలా తెలుస్తుంది?'

కోదండం మొహంలో పోయిన సంబరం తిరిగొచ్చింది.

వెంటనే చక్రపాణి చేతులు పట్టుకుని "త్వరగా అయ్యేట్లు చూడు బ్రదర్!" అన్నాడు ఆర్ధింపుగా.

వెంటనే చక్రపాణి హస్తం చూపించాడు.

దానికేసి చూస్తూ "ఏమిటీ దీనర్థం?" అనడిగాడు అయోమయంగా చూస్తూ.

"యాభై... వేలు..."

గుటకలు మింగాడు కోదండం...

"మళ్లీ యాభయ్యా?"

"తప్పదు! తగు మార్పులు చేయాలి కదా?"

బాలయోధుడు చిరంజీవి వాళ్లిద్దర్నీ మార్చి మార్చి చూస్తున్నాడు.

"సరే ప్రయత్నిస్తాను..."

"ఆలస్యం చేయకు. మళ్లీ అవకాశం దొరకదు..."

"అలాగే..."

"ఈమాటు నిర్భయంగా రైళ్లల్లో ప్రయాణం చేయొచ్చు"

"మా చిరంజీవి..."

"నీకు సహాయంగా ప్రయాణం చేయొచ్చు..."

చక్రపాణి వెళ్లిపోయాడు.

తాత, మనవడు మొహాలు చూసుకుంటుండగా నేను మెల్లగా తప్పుకున్నాను. ●